# సింగిల్ పేజీ కథలు

## మరో కోణం

**పల్లవికి ఆకలవ్వడం లేదు. చదువు కోబుద్ధి కావడం లేదు. ఆఖరుకు నిద్ర కూడా పట్టడం లేదు. ఈ లక్షణాలన్నీ దేనికి సంబంధించినవో మీరు ఊహించే ఉంటారు. మీ ఊహ కరెక్టే. అదేనండీ ఆమె ప్రేమలో పడింది. పడటమే కాదు అందులో నిండా మునిగిపోయింది కూడా. అందుకే తండ్రి, "కొన్నాళ్లు ఆగుదాం, నీ పీజీ అయ్యాక చూద్దాం" అన్నా కూడా వినక, అనిరుధ్‌ని ఎంగేజ్‌మెంట్ దాకా లాక్కు వచ్చింది.**

"అతనేమో, నీ చదువు పూర్తి అయి, ఉద్యోగం వచ్చాకే మన పెళ్లి" అంటూ కండిషన్ పెట్టి అమెరికా వెళ్లిపోయాడు తన చదువుకోసం.

"మహానుభావుడు... ఎలా ఉంటున్నాడో నాకు దూరంగా, నన్ను వదలిపెట్టి. నేను మాత్రం ఇరవైనాలుగు గంటలూ అతని ధ్యాసలోనే. పంచరంగుల్లో కలలు కంటూ చదువుని బుర్రకెక్కించుకోలేకపోతున్నాను. ఏం చెయ్యాలో? ఎలా చెయ్యాలో? ఇంకా రెండేళ్లు గడవాలి. నా ప్రాణానికి అవి రెండు యుగాల కంటే ఎక్కువే"

వరండాలో నిలబడిన ఆమె, ఆలోచనలలో మునిగిపోయి, వాన జల్లుతో బట్టలు, పుస్తకాలు తడిచిపోవడం కూడా గమనించలేదు.

అప్పుడే వచ్చిన తండ్రి శంకర్ తలుపు వేస్తూ "పల్లవీ" అని పిలవడంతో, ఉలిక్కిపడి ఈ లోకంలోకి వచ్చింది.

"ఏమిటమ్మా అంత పరధ్యానం?" తల తుడుచుకుంటూ అడిగాడు శంకర్.

"ఏం లేదు నాన్నా" తండ్రికి దొరికిపోయినందుకు సిగ్గుపడి, లోపలకు పరిగెత్తింది పల్లవి.

* * *

శంకర్ ఒక ప్రైవేట్ కంపెనీలో డైరెక్టర్. ఆస్తి, అందం అన్నీ ఉన్నవాడు. మంచితనం, మానవత్వం మూర్తీభవించిన వాడు.

శంకర్, ఉమల ఒక్కగా నొక్క కూతురు పల్లవి. ఆమెకు ఎనిమిదో సంవత్సరంలో ఉమ క్యాన్సర్‌తో చనిపోయింది. తల్లిలేని బిడ్డను అతి గారాబంగా ప్రాణాలన్నీ ఆమె మీదే పెట్టుకుని, జాగ్రత్తగా పెంచుతున్నాడు శంకర్. ఆమె ఇప్పుడు కంప్యూటర్ బి.ఎస్సీ ఫైనలియర్ చేస్తోంది. క్లాస్‌మేట్ అనిరుధ్‌ని ప్రేమించింది. కులాలూ, మతాలూ, ఆస్తులూ, అంతస్తులూ అంటూ శంకర్‌కు పట్టింపులు లేకపోయినా ఇద్దరి చదువులూ పూర్తయి



ఉద్యోగాలు వచ్చాకే పెళ్లి చేస్తానని చెప్పాడు. అయితే ఎంగేజ్‌మెంట్ అయినా చెయ్యమని పట్టుపట్టింది పల్లవి.

* * *

రాత్రి రెండు గంటలయింది. ఎన్ని రకాలుగా ప్రయత్నం చేసినా పల్లవికి నిద్రపట్టడం లేదు. ఎంగేజ్‌మెంట్ వరకే అయినా అనిరుధ్ మీది ప్రేమతో, విరహంతో అతని ఎడబాటు తను తట్టుకోలేకపోతోంది. మరి నాన్న... పది సంవత్సరాలు కాపురం చేసిన ప్రియమైన భార్య వియోగాన్ని ఎలా భరిస్తున్నారు? ఆ వియోగ బాధలో ఇన్ని సంవత్సరాలూ ఎలా గడిపారు? ఆమెకు ఎక్కడో చదివిన కొన్ని వాక్యాలు గుర్తు వచ్చాయి. ఒంటరితనం ఒక పీడకల. ఒంటరితనం ఒక జ్వాల. ఒంటరితనం ఒక ఎడారి. ఒంటరితనం ఒక చీకటి. ఒక కన్నీరు. ఒంటరితనంలోని బాధని ఆ రచయిత ఎంత చక్కగా చెప్పాడు! ఆ ఒంటరితనాన్ని నా కోసం సహనంతో భరిస్తున్నాడు నాన్న. ఔనూ, రేపు తనకు పెళ్లి అయి, అనిరుధ్‌తో అమెరికా వెళ్లిపోతే.. అప్పుడు నాన్న పరిస్థితి ఏమిటి? నన్ను కని, ఇంత గారాబంగా పెంచినందుకు, ఆయనకు లభించే బహుమానం ఇదేనా? ఆలోచిస్తున్న ఆమెకు గతం గుర్తుకు వచ్చింది.

తన తల్లి చనిపోయిన ఏడాదికి, తండ్రిని మళ్లీ పెళ్లిచేసుకొమ్మని మామ్మా, తాతగార్లతో పాటు తన అమ్మమ్మా, తాతగార్లు కూడా ఎంతో ఒత్తిడి చేశారు. కానీ తన తండ్రి దేనికీ లొంగలేదు. తన బిడ్డకు తల్లీ, తండ్రీ కూడా తానే అయి పెంచుకోవాలి అనుకున్నాడు.

అటువంటిది మరో రెండేళ్ల తర్వాత, సునందని చూసి, మనసు మార్చుకున్నాడు. ఆమె డైవోర్సీ. ఒక బాబు ఉన్నాడు. అందమూ, చదువూ వినయమూ ఆమె ఆభరణాలు. అయినా శాడిస్టు భర్తతో బాధలు పడుతుంటే ఆమె తల్లీ, తండ్రీ ఆమెనా నరకం నుండి తప్పించారు.

సునంద కూడా అదే ఆఫీసులో పనిచేస్తోంది. పల్లవికి తండ్రి మనసు అర్థమైంది. కానీ తండ్రి మరో పెళ్లి చేసుకోవడం అన్న భావనే ఆమె భరించలేకపోయింది. అందువల్ల సునంద మీద అసూయ పెంచుకున్నది. ఆమె మాటే ఎత్తనిచ్చేది కాదు. ఒకసారి ఏదో పని మీద తమ ఇంటికి వచ్చిన ఆమెను అకారణంగా అవమానించి పంపింది.

ఇది తెలిసినా శంకర్ కూతుర్ని ఒక్క మాట కూడా అనలేదు. కూతురి తరఫున సునందకు తను క్షమాపణ చెప్పుకున్నాడు. తన మనసులోని ఇష్టాలను, కోరికలను, ప్రేమను నిర్దాక్షిణ్యంగా సమాధి చేసేశాడు.

పల్లవికి ఇప్పుడు అదంతా గుర్తు వచ్చింది. దురదృష్టవశాత్తూ భార్యను పోగొట్టుకున్న ప్రేమమూర్తి అయిన తన తండ్రికి తను ఏం చేసింది, తను కూడా తీరని వేదననే కలిగించింది. రెండవ భార్య మోజులో పడి, మొదటి భార్య పిల్లను గాలికి వదిలేసిన వారు ఎంతో మంది ఉంటారు. కానీ తన తండ్రి తన కోసం ఆయన సర్వస్వం ధారపోశాడు. అటువంటి తండ్రికి తను మళ్లీ పెళ్లి ఎందుకు చెయ్యకూడదు? తండ్రి ఋణం ఎందుకు తీర్చుకో కూడదు? నన్నింత ప్రేమగా, గారాబంగా అపురూపంగా, ఆప్యాయంగా పెంచిన నాన్నకు నేనీ విధంగా కృతజ్ఞత ఎందుకు చూపకూడదు?

'రేపే సునంద ఆంటీవాళ్ల ఇంటికి వెళ్లి, ఆమెను బ్రతిమాలో, బుజ్జగించో పెళ్లికి ఒప్పిస్తాను. తప్పకుండా ఒప్పిస్తాను' అనుకుంటూ ఎప్పుడెప్పుడు తెల్లవారుతుందా అని ఆత్రంగా ఎదురుచూస్తున్న పల్లవికి ప్రశాంతంగా నిద్ర పట్టింది.

-కె.పుష్పాదేవి (విజయవాడ)